
కథ


# రంగుటద్దాలు

రావినూతల సువర్నాకన్నన్



అమెరికాలోని తెలుగువారి ఆహ్వానం మీద అక్కడికెళ్ళి పదిహేనురోజులు గడిపి ఇండియా తిరిగొచ్చి పది రోజులెపోయింది.

''అబ్బ! అది దేశమా కాదు! భూతలస్వర్గం. నయాగరా జలపాతం, లిబర్టీ విగ్రహం, యూనివర్సల్ స్టూడియోస్ ఒకటనేమిటి అన్నీ అద్భుతాలే. అక్కణ్ణించి ఇండియాలో అడుగుపెట్టగానే స్వర్గంలోంచి నరకంలో పడినట్టనిపించింది.'' అదే అంటే మా వారూ, పిల్లలూ నన్ను కొట్టినంత పనిచేశారు. అసలు మనదేశంలాంటి గొప్పదేశం ప్రపంచంలోనే లేదని వాదించారు.



''అవును. నీ గురించి రకరకాలుగా చెప్పుకుని చాలామంది నవ్వుకుంటున్నారు. నీకు 'అమెరికా సుత్తి' అని బిరుదు కూడా ఇచ్చారని మా ఫ్రెండ్ చెప్పాడు. ఇక నుంచి నీ నోట్లోంచి అమెరికా అన్న మాట రాకూడదు'' గంభీరంగా అనేసి విసురుగా బైటికెళ్లిపోయారు.

అవును మరి! కప్పల్లా, వాళ్ళే విదేశాలకైనా వెళ్తేగా! అమెరికా వెళ్ళొచ్చానన్న ఆనందంలో ఓ చిన్నపాటి అసంతృప్తి కూడా చోటుచేసుకుంది. కానీ అది మన తెలుగు పేపర్లలోని వార్త చూశాక ఆ అసంతృప్తి కూడా మాయమైంది''

అదేమిటంటే అమెరికావారి ఆహ్వానం మీద చాలామందే కలిసి వెళ్లాం. చాలా చోట్లు చూశాం. అభిమానుల ఇళ్ళల్లో మా అందరికీ బస ఏర్పాటు చేశారు. డెట్రాయిట్‌లోని ఓ పెద్ద గుళ్ళో ఫంక్షన్ అరేంజ్ చేశారు ఆరింటినుంచీ తొమ్మిదింటివరకూ.

ఎంతోమంది మాట్లాడారు. పాడారు ఆడారు. నావరకూ వచ్చేసరికి తొమ్మిది కావడంతో అంత వరకూ కిటకిటలాడుతున్నట్టున్న ప్రదేశమంతా ఖాళీ అయిపోయింది. లేచినవాళ్ళు మళ్ళీ ఎక్కడ కూర్చుంటారో అన్నట్టు కుర్చీలు తీసేస్తున్నారు నిర్వాహకులు. మైక్ కూడా తియ్యబోతుంటే ఓ మూలగా ఉన్న నేను కనిపించి నాలుక్కొరుక్కుని నన్ను కూడా ఓ సినీగాయనిగా పరిచయం చేశారందరికీ. ఏవిటి నా మొహం! అక్కడెవరున్నారనీ నాకు ఆతిథ్యం ఇచ్చినవారి కుటుంబసభ్యులు, మైక్ తాలూకు వాళ్ళు ఒకరిద్దరు నిర్వాహకులు. అయినా నా గురించి చెప్పుకోవాలిగా. గొంతు సవరించుకుని మొదలుపెట్టాను.

''నేను లతామంగేష్కర్ అంత గొప్పదాన్ని కాకపోయినా ఎస్.సోమేశ్వర్రావ్, ఎజి.రేమాన్, ధీరవాణి గార్లలాంటి మ్యూజిక్ డైరెక్షన్‌లో పాడాను. వాళ్లంతా నాది అచ్చం కోకిల కంఠం అని పొగిడారు. అసలు...'' నా మాట పూర్తికాకుండానే ఉన్న నలుగురూ చప్పట్లు కొట్టారు. 'ఇక చాలు' అన్నట్టు.

''అదే...ఇక్కడ టైమ్‌సెన్స్ ఎక్కువ'' ఇకిలించాడో నిర్వాహకుడు.

''నిజమే! ఇది ఇండియానా? ఆరింటికన్న ప్రోగ్రాం పదింటికి మొదలుపెట్టడానికి'' అనుకుంటూ డయాస్ దిగేశాను.

ఇండియా వచ్చాక పిల్లలు పేపర్స్ చూపిస్తే ముందు ఆశ్చర్యపోయి, తర్వాత ఆనందపడిపోయాను. ఆ పేపర్స్‌లో ప్రోగ్రాం గురించి రాస్తూ నా గానామృతాన్ని, నా గొప్పతనాన్ని చూసి అక్కడి అమెరికన్స్ సైతం తన్మయులై పోయారని ఉంది.

అంతే! ఇంక నా ఉత్సాహానికంతే లేకుండా పోయింది. వారం రోజులపాటు మా కాలనీ వాళ్లందరికీ నా అమెరికా ట్రిప్ గురించి అక్కడ విశేషాల గురించీ, సినిమా చూస్తున్నంత విపులంగా చెప్పేశాను. మరి అందరికీ అమెరికా వెళ్ళే అదృష్టం ఉండదు కదా. అయితే నా మంచితనాన్ని ఎవరూ అర్థం చేసుకున్నట్టు లేదు. నాలుగైదురోజులు శ్రద్ధగా విన్నా, ఆ తర్వాత నన్ను తప్పించుకు తిరగడమే కాదు నన్నంత దూరాన చూస్తూనే పులి తరుముతున్న లేడికూనల్లా పారిపోసాగారు. అదంతా జెలసీ అని నాకు తెలుసు. అందుకే నేనంతగా బాధపడలేదు. కానీ మా పిల్లలు.

''అమ్మా! అమెరికా నువ్వొక్కదానివే వెళ్ళావా! అసలు నీ గురించి అంతా ఏమనుకుంటున్నారో తెలుసా! అమెరికా ట్రిప్ సెలెక్షన్ కమిటీలో మామయ్య ఉండబట్టే నువ్వెళ్లావనీ, ఏ అర్హతా లేని ఈవిడ వాళ్ళు పిలిస్తే మాత్రం ఎలా వెళ్ళింది అనీ, వెళ్ళింది కామ్‌గా ఊరుకోక ఏదో చంద్రమండలానికి వెళ్ళొచ్చినట్టు తన ట్రిప్ గురించి చెప్పిందే వందసార్లు చెప్పి ఊదరగొట్టేస్తోంది అనీ...ఇంకా చాలా అనుకుంటున్నారు, నవ్వుకుంటున్నారు'' రుసరుసలాడుతూ అన్నాడు మా పెద్దాడు.

''అవునమ్మా! ఈరోజుల్లో అమెరికా వెళ్ళడం పెద్ద గొప్పేంకాదు. మన వీధి చివర మూర్తి అంకుల్ వాళ్ళ పనిమనిషికూడా కూతురి పురుడు పోయడానికి అమెరికా వెళ్ళింది. ప్లీజ్! ఇంక నువ్వా అమెరికా ట్రిప్ గురించి మాట్లాడకమ్మా'' ఎర్రబడిన మొహంతో అన్నాడు మా చిన్నాడు. అంతవరకూ మౌనంగా ఉన్న మా వారు–

''అవును. నీ గురించి రకరకాలుగా చెప్పుకుని చాలామంది నవ్వుకుంటున్నారు. నీకు 'అమెరికా సుత్తి' అని బిరుదు కూడా ఇచ్చారని మా ఫ్రెండ్ చెప్పాడు. ఇంక నుంచి నీ నోట్లోంచి అమెరికా అన్న మాట రాకూడదు'' గంభీరంగా అనేసి విసురుగా బైటికెళ్లిపోయారు.

నేను ప్రతిమలా అయిపోయాను. వాళ్లంతా అలా మాట్లాడితే ఇంక నేను అమెరికా గొప్పదనం ఎలా చెప్పను? పోనీ వాళ్లు చూడకుండా చెప్పాలనుకున్నా. నన్ను చూడగానే బాంబు పడబోతున్నట్టు అందరూ ఆమడదూరం పారిపోతున్నారే! అందుకే నోరుమూసుకుని కూర్చున్నాను. అయినా నా అనుభవాలు ఎవరికైనా చెప్పుకోవాలన్న ఆరాటం పోలేదు.

అలాంటి సమయంలో మా ఫ్రెండ్ విజయ వాళ్ళ చెల్లెలి పెళ్లికి పిలవడానికొచ్చింది. ఓ అరగంట పాటు క్లుప్తంగా నా అమెరికా అనుభవాల గురించి చెప్తే అది చాలా ఆనందపడిపోయి ఇంకా చాలామందిని పిలవాలనీ తర్వాత అమెరికా వివరాలన్నీ చెప్పాలనీ, పెళ్ళికి అందరూ తప్పకుండా రావాలనీ మరీ మరీ చెప్పి వెళ్లిపోయింది. ఎందుకో నాకు వెయ్యి ఏనుగుల బలం వచ్చింది.

పెళ్లిరోజు రానే వచ్చింది. మావారు, మా పిల్లలూ రానంటే నేనొక్కదాన్నే ఆటోలో కళ్యాణ మంటపానికి బయల్దేరాను. మధ్యలో ట్రాఫిక్ జామ్! 'ప్చ్! ఇదే ఇండియా అంటే. ఇలా అమెరికాలో జరుగుతుందా!'మనసులో విసుక్కుంటూనే రెండుగంటల తర్వాత గమ్యం చేరుకున్నాను. అప్పటికే పెళ్లి మంటపం, పరిసరాలూ కిటకిటలాడిపోతున్నాయి.

ఆలస్యం చేసినందుకు అక్షింతలు, వేస్తూనే నాకు టిఫిన్ అవీ పెట్టించి కూర్చోపెట్టింది విజయ.

అప్పుడే అత్తిలినించి విజయ పెద నాన్నగారు ఓ బ్యాగ్‌తో దిగారు. నర్సాపూర్ రెండుగం

టలు లేటైందనీ, తన భార్య బాత్‌రూంలో కాలు జారి పడ్డం వల్ల కాలు వాచి రాలేకపోయిందనీ, వంద సంజాయిషీలు చెప్పుకున్నాక ఆయన చేతిలోని బ్యాగ్ లాక్కుని ఎవరో పిలవడంతో ఆయన క్కావలసినవన్నీ చూడమని నాకు పురమాయించి టిఫిన్ చెయ్యగానే మంటపం దగ్గరికి వచ్చెయ్యమని ఆయనతో చెప్పి పరిగెత్తింది విజయ.

డబ్బుయ్యేళ్ళున్న ఆయన పసిమిఛాయతో మల్లెపువ్వులాంటి పంచె, లాల్చీ, ఉత్తరీయంతో, చెదరని చిరునవ్వుతో ఎంతో సంస్కారవంతుళ్ళా ఉన్నాడు. ఆయన చెయ్యి పట్టుకుని చనువుగా టిఫిన్ సెక్షన్‌కేసి తీసికెళ్లాను.

''పాపం! ఆ ముసలాయనెవరో! మన అమెరికా సుత్తికి దొరికిపోయాడు. ఇంక ఆయన్ని దేవుడే కాపాడాలి''అంటూ కొందరమ్మలక్కలు గుసగుసలాడుకోవడం నా చెవినపడ్డా నేను పట్టించుకోలేదు. ఆయన్ని కూర్చోపెట్టి స్వయంగా టిఫిన్ అదీ తెచ్చిపెట్టాను. మెల్లగా ఆయన వివరాలు సేకరించాను.

వాళ్లది అత్తిలీ అనీ, హైదరాబాద్ వచ్చి కూడా చాలా కాలం అయిందనీ, అత్తిల్లో తమకి మామిడితోటలూ, పనసతోటలూ ఉన్నాయనీ, చెట్లనీడంటే ఆయనకి ప్రాణమనీ...ఇంకా ఇలాంటివే చాలా రాబట్టాను. ఆయన గురించి అడిగితే నా గురించి కూడా అడుగుతాడనీ, అప్పుడు నా అమెరికా ట్రిప్ గురించి చెప్పాలనీ ఎదురుచూశాను. అయితే ఎంతసేపూ ఆయన కోనసీమను గురించి, కొబ్బరితోటల గురించీ తప్ప నా గురించేం అడగలేదు. ఇక నేనే చెప్పేయ్యాలనుకున్నాను.

''మీకు పచ్చని ప్రదేశాలంటే అంత ఇష్టమా బాబాయ్‌గారూ!'' అన్నాను చనువుగా వరస కలుపుతూ.

''ఇష్టంకాదు,ప్రాణం'' అన్నాడాయన.

''అయితే మరోసారి అమెరికా వెళ్లి తీరాలి'' అన్నాను.

''అమెరికానా''

''అవును. ఆ దేశంలో ఎక్కడ చూసినా హరిత వనాలే! ఆ పచ్చని చెట్లు, నయాగరా జలపాతం... సుందరమైన సరస్సులు అబ్బ! ఆ దేశమే వేరు. ఒక్కసారి మీరు వాటిని చూశారంటే ఇక కోనసీమ, అత్తిలి....లాంటివి పూర్తిగా మర్చిపోతారు'' అన్నాను తన్మయత్వంగా.

ఆయన కళ్ళు ఆశ్చర్యంగా చూశాయి.

''నువ్వెళ్లావా?'' అన్నాడు ఉత్సాహంగా.

''ఓ! వెళ్లాను. మామూలుగా కాదు. అమెరికా వాళ్ల ఆహ్వానం మీద వెళ్లాను'' అంటూ నేను ఇండియాలో బయల్దేరిన దగ్గర్నించీ మళ్ళీ ఇండియా తిరిగి వచ్చేదాకా చెప్పాలనుకుని టేప్ ఆన్ చేశాను. నా అనుభవాలు పూర్తికానేలేదు.

''చెప్పింది చాలుగానీ అవతల సూత్రధారణ అయిపోతోంది ఇంకాయన్ని వదులు!'' వ్యంగ్యంగా అంది మా కాలనీలోనే ఉండే ఒకావిడ.

ఆనందంగా మృష్టాన్నభోజనం చేస్తున్న వాడి పంటికింద పలుగురాయి పడ్డట్టయింది నాకు. ఉసూరుమంటూ కదిలాను.

అప్పటికే పెళ్లి తతంగం దాదాపు పూర్తయినట్టుంది. హాలంతా పచ్చబడిపోయింది. మంటపం మీద మాత్రం వధూవరులతో పాటు కొందరు దగ్గరివాళ్ళున్నారు. అంత దూరం నించి మమ్మల్ని చూసిన విజయ పరిగెత్తుకుంటూ వచ్చి.

''థ్యాంక్ మున్నీ! నేను హడావిడిలో పడిపోయినా పెదనాన్నకి మంచి కంపెనీ ఇచ్చావ్'' అంటూ మా ఇద్దర్నీ మంటపం దగ్గరికి తీసికెళ్లింది. విజయా వాళ్ళ నాన్న, అక్కగార్ని చూసి గభాల్న లేచి కావలించుకున్నాడు. వధూవరులు ఆయన కాళ్లకి నమస్కరించారు. విజయా వాళ్లమ్మ-

''దెబ్బవల్ల రాలేదు కానీ అక్కయ్య కూడా వస్తే బావుండేది'' అంది అభిమానంగా చూస్తూ.

''తప్పకుండా వస్తుంది. వెళ్ళేలోగా మిమ్మల్ని చూడకుండా ఉంటుందా!'' హాయిగా నవ్వాడాయన.

''ఇంకా ఎన్నాళ్ళుంటారు?'' ఆత్రుతగా అడిగింది విజయ.

''రేపాదివారం కాక పై ఆదివారం! కానీ నాకు వెళ్లాలని లేదమ్మా!'' పసివాడిలా అన్నాడాయన. నేను అయోమయంగా చూస్తుంటే ''అన్నట్టు మున్నీ నీకు చెప్పలేదు కదా! మా పెదనాన్న పెద్ద సర్జన్. నలభైఏళ్ళుగా అమెరికాలో ఉంటున్నారు. ఒకప్పుడు డాక్టరుగా అమెరికా అంతా అంగుళం వదలకుండా తిరిగారు. ఇప్పుడు కొడుకులూ డాక్టర్లు కావడంతో కాస్త విశ్రాంతి తీసుకుంటున్నారు. నీకు అమెరికా అంటే పిచ్చ ఇష్టం కదా. ఏదైనా ఇన్‌ఫర్మేషన్ కావాలంటే పెదనాన్న నడుగు'' నవ్వుతూ అంది విజయ.

ఓ క్షణం నేను కొయ్యబారిపోయాను.

''మీది అత్తిలి కాదూ!'' అన్నాను తడారిపోతున్న గొంతుతో.

''మాది అత్తిలే! నాకు ఇండియా అన్నా, ఇండియాలోని మా అత్తిలి అన్నా ప్రాణం. నలభై ఏళ్ళ కిందట కొన్నాళ్ళుండి వద్దామని వెళ్లాను. చిత్రంగా అక్కడే చిక్కుకుపోయాను. ముఖ్యంగా నా భార్య, పిల్లలూ ఇండియా రావడానికి ఒప్పుకోలేదు. కానీ తరచూ వచ్చిపోతూంటాను. సారీ ఈ విషయం నీకు ముందుగానే చెప్పాలనుకున్నా, అమెరికాని గురించి నువ్వు ఉత్సాహంగా చెప్తుంటే వారించలేకపోయాను'' అన్నాడాయన సౌమ్యంగా.

నా మొహంలో నెత్తురు బొట్టులేనంతగా పాలిపోయింది.

''చూడు తల్లీ! అన్నం పెట్టిన, పెడుతున్న దేశాన్నే విమర్శిస్తున్నానని అనుకోకపోతే ఒక్క మాట! 'దూరపుకొండలు నునుపు' అన్నట్టు మంచిచెడులు అన్నిచోట్లా ఉంటాయి. మంచేదో చెడేదో దగ్గరికెళ్లి చూస్తేనే తెలిసేది. రెండువారాల పాటు అలా తిరిగొస్తే అమెరికాని గురించి ఏం తెలుస్తుంది? పై మెరుగులు తప్ప. ఏదైనా దగ్గరికెళ్ళి గమనిస్తేనే అవగతం అయ్యేది? అసలు మన ఇండియా ఉన్నంత ప్రశాంతంగా ఏ దేశం ఉండదనే నా అభిప్రాయం. అక్కడున్న కొన్ని విధానాల గురించి తెలిస్తే నీకు తల తిరుగుతుంది. కొందరు స్కూల్ పిల్లలు కూడా గన్స్‌తో వచ్చి, విచక్షణారహితంగా కాల్చి ఎంతమంది ప్రాణాల్ని బలితీసుకున్నారో నీకు తెలిసే ఉంటుంది. మర్డర్లు, మానభంగాలు, అల్లర్లు నీ దృష్టికి వచ్చి ఉండకపోవచ్చు. ఏది ఏమైనా మాతృభూమిని మించిన స్వర్గం వేరే ఉంటుందనుకోను. దయచేసి పై మెరుగులు చూసి భ్రమపడకండి'' రవ్వంత ఆవేశంగా అన్నాడాయన.

నాకు తలతిరిగిపోయింది. నా మొహం చూసి ఆయన నిజంగా సరదాకబుర్లు చెప్పి నవ్వించారనుకోండి.

తర్వాత ఇంటికొచ్చి ఒంటరిగా పడుకుని ఆలోచించసాగాను. అసలు నేనెలాంటి గాయకురాలిని. నేను చెప్పిన సంగీత దర్శకుల సినిమాల్లో నా పాత్ర ఉన్నది నిజమే. అదేవిటని ఎవరైనా నిలదీస్తే! అయినా మీకు చెప్తాను. ఒక సినిమాలో హీరోయిన్ చిలుక ముందు ఓ పాట పాడుతుంది. ఆ చిలుక రెండు పలుకులు పలుకుతుంది. ఆ రామచిలుక పలుకులు నావే. రెండోది ఓ అడవిలో కోయిలకూత వినిపిస్తుంది. అదీ నాదే. కోయిలక్కడ దొరక్కకాదు, అలాంటి ఇన్‌స్ట్రుమెంట్ దొరక్కకాదు. ఓ సినీ దర్శకుడు మా బంధువవడం వల్లే ఆ పలుకులైనా పలికాను. మూడోది పెంపుడు కోతి కిచకిచలు.

ఇలా నేను సినీగాయకురాలిగా పేరు తెచ్చుకున్నాను (నాకు నేనే) అమెరికా ట్రిప్ ఛాన్సూ సంపాదించాను. దాని వివరాలొద్దు. చంద్రమండలానికెళ్ళొచ్చినట్టు ఫీలయిపోయి నిజంగానే అమెరికా సుత్తిగా మారాను.

విజయా వాళ్ళింటినించి వచ్చిందగ్గర్నించీ ఎవరిదగ్గరా అమెరికా పేరెత్తితే ఒట్టు. అది కేవలం అక్కడ జరిగిన సంఘటనే కాదు. జాగ్రత్తగా విదేశీయత మోజులోంచి బైటపడి ఆలోచిస్తే 'నాదేశం కన్నా సుందరమైన దేశం ఎక్కడుంది? మా ఊళ్ళ కన్నా అందమైన ఊళ్ళు ఏ దేశంలో ఉన్నాయి?' అనిపించింది.

అవును!

మా పల్లె! పల్లెలో ధర్మచెరువు, వేణుగోపాల స్వామి ఆలయం, చెరువు ఒడ్డునున్న బ్రహ్మాండమైన రావిచెట్టు, దానికున్న ఉయ్యాల...ఆ ఉయ్యాల్లో ఆకాశాన్నంటేలా ఊగడం, చెరువులో పడి సాటి పిల్లలతో కలిసి కిలకిలలాడుతూ ఈత లుకొట్టడం. ఓహ్! ఇంతకన్నా మధురానుభూతులు ఎక్కడ దొరుకుతాయి?

అందుకే మాదేశం భూతల స్వర్గం. మా ఊరో నందనవనం. ఇది నిజం!

★